నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
nipuna
Every Wednesday Free Supplement
03.
24 ఏప్రిల్ 2024
పేజీలు 8

## టీఎస్ఆర్టీసీకి పురస్కారాలు

అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అండర్‌టేకింగ్స్ (ఏఎస్ఆర్‌టీయూ) ఏటా అందించే ప్రతిష్ఠాత్మక ఐదు ఎక్సలెన్స్ అవార్డులను టీఎస్ఆర్టీసీ గెలుచుకుంది. 2022-23 ఏడాదికి రహదారి భద్రత, ఇంధన సామర్థ్య నిర్వహణ, సిబ్బంది సంక్షేమం, సాంకేతికత విని యోగం తదితర కేటగిరీల్లో ఈ పురస్కారాలు దక్కాయి. న్యూఢిల్లీలోని ఇండియా హ్యాబిటాట్ సెంటర్‌లో మార్చి 15న ఈ అవార్డులను ప్రదానం చేశారు.

## 2023 ర్యాంకర్ల విశేషాలు

- మొదటి పది ర్యాంకర్లు ఇంజినీరింగ్ బ్యాక్‌గ్రౌండ్ నుంచి వచ్చినవారు ఉన్నారు
- మొదటి పది ర్యాంకర్లలో ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన వారు నలుగురు, ఐఐటీల నుంచి ముగ్గురు, ఎన్ఐటీల నుంచి ఇద్దరు, ఎన్ఎల్‌యూ, కేరళ యూనివర్సిటీ నుంచి ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు.
- మొదటి ర్యాంకర్ ఐఐటీ కాన్పూర్‌లో బీటెక్+ఎంటెక్ (ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్), రెండో ర్యాంకర్ ఎన్ఐటీ రూర్కెలలో బీటెక్ కంప్యూటర్ సైన్స్, మూడో ర్యాంకర్ మిరండా హౌజ్‌లో జియాలజీ గ్రాడ్యుయేషన్, నాలుగో ర్యాంకర్ కేరళ యూనివర్సిటీలో ఆర్కిటెక్చర్ గ్రాడ్యుయేట్, ఐదో ర్యాంకర్ ఢిల్లీ యూనివర్సిటీలో ఎకనామిక్స్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. విభిన్న విద్యా నేపథ్యాల నుంచి వచ్చి టాపర్స్‌గా నిలిచారు.
- గతేడాది ఫలితాల్లో తెలంగాణ నుంచి మూడో ర్యాంక్ ఉమా హారతి సాధించగా ఈసారి కూడా మహబూబ్‌నగర్ జిల్లా నుంచి అనన్య రెడ్డి మూడో ర్యాంక్ సాధించడం విశేషం
- ఎక్కువమంది అభ్యర్థులు కోచింగ్ లేకుండా సర్వీస్ సాధించడం మరో విశేషం
- విధి వంచించినా తమ తలరాతను మార్చుకున్నవారు ఈసారి ఎక్కువ మంది ఉండటం భవిష్యత్తు అభ్యర్థులకు స్ఫూర్తిదాయకం
- విజయం సాధించిన అందరూ సమాజ సేవ చేయాలనే తపనతోపాటు సివిల్స్ రాసే అభ్యర్థులకు తమ వంతు చేయూత తనిస్తామని ప్రకటించడం మరో విశేషం.

## మూడో ప్రయత్నంలో ఫస్ట్ ర్యాంక్

- సివిల్స్ 2023లో ఆల్ ఇండియా టాపర్ ఆదిత్య శ్రీవాత్సవ. లక్నోకు చెందిన ఆదిత్య ఐఐటీ కాన్పూర్‌లో బీటెక్+ఎంటెక్ పూర్తి చేశాడు. అనంతరం గోల్డ్‌మన్ సాచెస్‌లో మంచి ప్యాకేజీతో కొలువులో చేరాడు కానీ ఆ వృత్తిలో ఏదో అసంతృప్తి దాంతో జాబ్‌కు రాజీనామా చేసి ప్రజల కోసం పనిచేయాలనే తపనతో సివిల్స్ వైపు అడుగులు వేశాడు.
- మొదటి ప్రయత్నంలో ప్రిలిమ్స్‌లో క్వాలిఫై కాలేదు. రెండోసారి ఐపీఎస్‌గా ఎంపికైనా తాను అనుకున్న ఐఏఎస్ సాధన కోసం ఐపీఎస్ ట్రెయినింగ్‌లో ఉండి మూడో ప్రయత్నంలో ఫస్ట్ ర్యాంక్ సాధించాడు.
- ప్రతిరోజు లక్ష్యాలను పెట్టుకుని అది పూర్తయ్యే వరకు చదివడం వల్లే లక్ష్యం చేరుకున్నానని తెలిపారు.
- నిజాయతీతో కూడిన ప్రిపరేషన్, స్థిరమైన లక్ష్యంతో దేనిలోనైనా విజయం సాధించవచ్చని ఆదిత్య పేర్కొన్నారు



## ఎన్ఐటీ నుంచి...



- ఒడిశాకు చెందిన అనిమేష్ ప్రధాన్ సివిల్స్‌లో రెండో ర్యాంక్ సాధించాడు. అనిమేష్ ఎన్ఐటీ రూర్కెల నుంచి బీటెక్ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేశాడు.
- ఐవోసీఎల్‌లో ఉద్యోగం చేస్తూనే సివిల్స్ వైపు అడుగులు వేశాడు. 11వ తరగతి చదువుతున్నప్పుడు తండ్రి, సరిగ్గా ఇంటర్వ్యూకు నెల ముందు తల్లి చనిపోయినా తన లక్ష్యం కోసం శ్రమించి ఆల్ ఇండియా రెండో ర్యాంకర్‌గా నిలిచాడు.

## ఆర్కిటెక్చర్ చదివి...

ఆల్ ఇండియా నాలుగో ర్యాంక్ సాధించిన సిద్ధార్థ్ రామ్‌కుమార్ కేరళ రాష్ట్రానికి చెందినవాడు. అందరికీ భిన్నంగా ఇతడు ఆర్కిటెక్చర్ నుంచి సివిల్స్ వైపు రావడం విశేషం. ఆర్కిటెక్చర్ డిగ్రీ పూర్తిచేసిన తర్వాత సివిల్స్ వైపు ప్రస్థానం ప్రారంభించి మొదట ఇండియన్ పోస్ట్ అండ్ టెలీ కమ్యూనికేషన్ అకౌంట్స్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సాధించాడు. తర్వాతి ప్రయత్నంలో 121వ ర్యాంక్‌తో ఐపీఎస్ సాధించి ప్రస్తుతం హైదరాబాద్‌లో శిక్షణలో ఉన్నాడు. ఈసారి నాలుగో ర్యాంక్ సాధించి తన లక్ష్యమైన ఐఏఎస్ సాధించాడు.



## మొదటి ప్రయత్నంలోనే...

**సివిల్స్‌లో ఏదో ఒక ర్యాంక్ వస్తే చాలనుకుంది. కానీ అనూహ్యంగా ఆలిండియా మూడో ర్యాంక్ వచ్చింది. అది కూడా తొలి ప్రయత్నంలోనే. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన అనన్య రెడ్డి విజయ ప్రస్థానం ఆమె మాటల్లో..**



**అనన్య రెడ్డి 3వ ర్యాంక్**

**కుటుంబం, చదువు**

- మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలోని అడ్డాకుల మండలం పొన్నకల్ స్వగ్రామం. తల్లిదండ్రులు దోనూరు మంజుల, సురేశ్‌రెడ్డి. మాది వ్యవసాయ కుటుంబం. అమ్మానాన్నలకు నాతో పాటు చెల్లి కూడా ఉంది.
- నేను మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని యూనివర్సల్ పాఠశాలలో ప్రాథమిక విద్య, కాకతీయ పాఠశాలలో ప్రాథమికోన్నత విద్య, గీతం పాఠశాలలో ఉన్నత విద్య, హైదరాబాద్‌లోని హయత్‌నగర్ నారాయణ ఐఏఎస్ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివాను. ఢిల్లీలోని మిరిండా హౌస్ యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశాను.

**సివిల్స్ వైపు రావడానికి కారణం**

- ప్రభుత్వ ఉద్యోగి అయిన తాతయ్య చిన్నప్పుడు ఒకసారి మహబూబ్‌నగర్ కలెక్టర్‌ను చూపించి నువ్వు పెద్దయ్యాక అలాగే కావాలని అన్నారు. చిన్నప్పుడు దాని గురించి పెద్దగా పట్టించుకోలేదు. కానీ పెద్దయ్యాక అదే లక్ష్యంగా తీసుకున్నాను. డిగ్రీ నుంచే సివిల్స్ ప్రిపరేషన్ మొదలు పెట్టాను.

**ప్రిపరేషన్**

- ఆంత్రోపాలజీ ఆప్షనల్ సబ్జెక్టు తీసుకొని ప్రిపేరయ్యాను. సివిల్స్‌లో బెంచ్ మార్క్స్ గురించి కూడా తెలియకుండానే ప్రిపరేషన్ మొదలుపెట్టాను. ఒక సబ్జెక్ట్ పూర్తి చేయాలనుకుంటే 12 నుంచి 14 గంటల్లో పూర్తి చేసేదాన్ని. అంతకు మించి ఎక్కువ గంటలు ఎప్పుడూ చదవలేదు. ఎగ్జామినర్ ఏం కోరుకుంటున్నారో అదే చదివాను. ఆంత్రోపాలజీ గురించి ఆన్‌లైన్‌లో మూడు నెలలు కోచింగ్ తీసుకున్నాను. ఎక్కువగా రివిజన్ చేసేదాన్ని. మాక్ ఇంటర్వ్యూలు చేశాను. రెండు సంవత్సరాలు పూర్తిగా సివిల్స్ ప్రిపరేషన్ కోసమే కేటాయించాను.
- ఒత్తిడికి గురికాకుండా ఉండేందుకు క్రికెట్ చూసేదాన్ని, నవలలు చదివేదాన్ని, స్నేహితులు, కుటుంబ సభ్యులతో మాట్లాడేదాన్ని.

**ఇంటర్వ్యూ**

- సుమన్ శర్మ మేడం బోర్డు ఇంటర్వ్యూ చేసింది. 35 నిమిషాలు జరిగింది. ఇంటర్నేషనల్ రిలేషన్స్, ఎకానమీ, ఎన్విరాన్‌మెంట్ జాగ్రఫీ, పావర్టీ రిలేషన్స్, ఇజ్రాయెల్-హమాస్ గురించి అడిగారు. నా కాన్ఫిడెన్స్‌ను పరీక్షించేలా ప్రశ్నించారు. ఎక్కడా తడబాటు లేకుండా కాన్ఫిడెంట్‌గా జవాబులు చెప్పాను.

**ఐఏఎస్‌గా..**

- అధికారిణిగా పాలనను ప్రజల వద్దకు చేర్చడమే లక్ష్యంగా పని చేస్తాను.

## హార్డ్‌వర్క్‌తో ఐఏఎస్‌గా..

**రెండుసార్లు సివిల్స్ కొట్టింది.. అయినా సంతృప్తి చెందలేదు. దానికి కారణం ఐఏఎస్ రాలేదన్న వెలితి. కలెక్టర్ అయితేనే సమాజానికి ఏదైనా మంచి చేయగలమని భావించింది. మంచి చేసే ఆఫీసర్ల ఆర్టికల్స్‌ను దినపత్రికల్లో చూసి స్ఫూర్తి పొందింది. ఎట్టకేలకు మూడో ప్రయత్నంలో తన కలను సాకారం చేసుకుంది చందన జాహ్నవి. ఆమె 'నిపుణ ప్రతినిధి'తో చెప్పుకొచ్చిన విశేషాలు..**



**కేఎన్ చందన జాహ్నవి 50వ ర్యాంక్**

**కుటుంబ నేపథ్యం, విద్య?**

- మాది హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్. నాన్న కె.రాంబాబు ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కాలేజీకి వైస్ చైర్మన్‌గా ఉన్నారు. అమ్మ లక్ష్మీ లలిత ప్రీ ప్రైమరీ ప్రయివేట్ స్కూల్ టీచర్. 10వ తరగతి వరకు జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్‌లో, ఇంటర్ రామయ్య కాలేజీ, డిగ్రీ బీఐటీ మెస్రా (రాంచి), ఎంబీఏ ఐఐఎం ఇండోర్ నుంచి పూర్తి చేశాను.

**ప్రిపరేషన్ ప్లాన్?**

- 2019లో ఎంబీఏ అవ్వగానే కొన్ని నెలల పాటు ప్రైవేటు జాబ్ చేశాను. అనంతరం జాబ్ వదిలేసి పూర్తి సమయం ప్రిపరేషన్‌కే కేటాయించాను. రోజూ 8-9 గంటలు చదివాను. సోషియాలజీ ఆప్షనల్‌తో పరీక్ష రాశాను. ఆప్షనల్‌కు ఆన్‌లైన్‌లో కోర్సు తీసుకుని కంప్లీట్ చేశాను. NCERT, లక్ష్మీకాంత్, స్పెక్ట్రమ్, స్టాండర్డ్ తదితర పుస్తకాలు చదివాను. ప్రత్యేకించి కోచింగ్ తీసుకోలేదు. ఫోరమ్ ఐఏఎస్, విజన్ ఐఏఎస్ టెస్ట్ సిరీస్‌లకు అటెండయ్యాను. ఇంటర్వ్యూకు గైడెన్స్ తీసుకున్నాను.

**ఎన్నో ప్రయత్నం, ర్యాంకు?**

- మూడో ప్రయత్నంలో 50వ ర్యాంకు వచ్చింది. ఈసారి ఐఏఎస్ వస్తుంది. మొదటి అటెంప్ట్‌లో ఇండియన్ కార్పొరేట్ లా సర్వీస్ (ఐసీఎల్ఎస్) 2020, రెండోసారి ఐఆర్ఎస్ (2022) రావడంతో విధులు నిర్వహిస్తూనే ప్రిపేరయ్యాను. సక్సెస్ ఎల్లప్పుడూ నా వెన్నంటే ఉంది. దానికి నా హార్డ్‌వర్కే కారణం. చాలా హ్యాపీగా ఉంది.

**ఒత్తిడి సమయాల్లో..**

- చదివే సమయంలో ఎటువంటి ఇబ్బందులు రాలేదు. ఒత్తిడి సమయంలో మ్యూజిక్ వినడం, బుక్స్ చదవటం, స్పోర్ట్స్ ఆడటం, వాకింగ్ చేయటం వంటివి చేసేదాన్ని. వీణ కూడా వాయిస్తాను. కుటుంబ సభ్యులు ఏ ఇబ్బందిని దరి చేరనివ్వలేదు. వారి సహకారం ఎనలేనిది.

**ఇంటర్వ్యూ విశేషాలు?**

- దినేష్ దాసా బృందం 25 నిమిషాల పాటు ఇంటర్వ్యూ చేసింది. రెవెన్యూ సర్వీస్ కార్పొరేట్ పన్ను పెంచాలా, వద్దా? ట్యాక్స్ బేస్ ఎందుకు పెరగట్లేదు? ఫార్మాసూటికల్స్‌లో సమస్యలేంటి? బెంగళూరు, హైదరాబాద్, రాంచి, ఇండోర్, గురుగావ్ నగరాల మధ్య భేదాలు.. అక్కడున్న సమస్యలు, నాకు ఇష్టమైన కర్ణాటిక్ మ్యూజిక్ విశేషాలు, నేను ప్రయాణించిన మార్గాల్లో ఉన్న బల్లార్ష, రాయ్‌పూర్, రాంచి రైల్వే స్టేషన్లలో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి మీరైతే ఏం చేస్తారు? వంటి ప్రశ్నలు అడిగారు. అన్ని ప్రశ్నలకు ఆన్సర్ చేశాను.

**సర్వీస్‌లో చేరాక..**

- తాత కె.కృష్ణమూర్తి రిటైర్డ్ ఐఏఎస్ స్ఫూర్తితో పాటు దినపత్రికల్లో ఆఫీసర్లు చేసిన మంచి పనులు నన్ను ఇటువైపొచ్చేలా చేశాయి. సమాజానికి నావంతు బాధ్యతగా మంచి చేస్తాను.

**భవిష్యత్‌లో రాసేవారికి సలహాలు?**

- ఎవరికి సెట్ అయ్యేది వారు లక్ష్యంగా ఎంచుకోవాలి. ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాయాలి. కనీసం కొన్ని అటెంప్ట్స్ అయినా ఇవ్వాలనే కసితో సివిల్స్ వైపు రావాలి. ఒత్తిడి సమయాల్లో ఔత్సాహికులు ఆటలు ఆడటం, కల్చరల్ యాక్టివిటీ, వాకింగ్ వంటివి చేయాలని చెప్తాను. హార్డ్‌వర్క్ మంచి ఆఫీసర్‌ను చేయకపోయినా గొప్ప పౌరుడిని మాత్రం చేస్తుంది.

సురేందర్ బండారు